క్లుప్తంగా

పెద్దింట్లమ్మ ఉత్సవాలు ప్రారంభం


కేశవదాసుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు మెండుపాలెంలో కొలువైన పెద్దింట్లమ్మ అమ్మవారి ఆలయంలో ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో ఉత్సవాలు మొదలయ్యాయి. అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశాలపై శుక్రవారం నుంచి మార్చి 28వ తేదీ వరకూ ఉత్సవాలను ఎండోమెంట్స్ ఆధ్వర్యంలో అంతర్వేది దేవస్థానం, పోలీసు, రెవెన్యూ సహకారంతో నిర్వహించనున్నారు. అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, రాజోలు సీఐ టీవీ నరేష్ కుమార్ పర్యవేక్షణలో అంతర్వేది ఆలయ అర్చకులు, స్థానిక ఆసాదులు, ఆయా శాఖల సిబ్బంది నెలరోజుల పాటు నిర్వహించే అమ్మవారి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయ పరిధిలోని రెండు వర్గాలు మధ్య విభేదాలు ఉండడంతో ముందస్తు జాగ్రత్తలపై పైస్థాయి అధికారులు ఈ చర్యలకు ఆదేశాలు ఇచ్చిన సంగతి విదితమే.

వైభవంగా చండీహోమం

ఆలమూరు: మండలంలోని చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం వైభవంగా చండీహోమం జరిగింది. ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించిన ఈ హోమంలో జిల్లా నలు మూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం నూకాంబిక అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


లక్కవరం శిశుమందిర్‌లో నేషనల్ సైన్స్‌డేలో మాట్లాడుతున్న డాక్టర్ సర్వేశ్వరశర్మ


అంబాజీపేటలో రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


మొగలికుదురులో విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనా ప్రాజెక్టులు


ఆలమూరులో సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు


చింతనలంకలో సైన్స్ ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్, సర్పంచ్ వెంకటరత్నం తదితరులు

దేశం గర్వించదగిన శాస్త్రవేత్త రామన్

- ఘనంగా సైన్స్ దినోత్సవం
- ఆకట్టుకున్న ప్రదర్శనలు

అంబాజీపేట: నోబెల్ బహుమతి అందుకున్న మొట్టమొదటి భారత భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ అని హెచ్‌ఎంలు కడలి సాయిరామ్, ఏవీఎల్ వరప్రసాద్ అన్నారు. ప్రపంచ సైన్స్ దినోత్సవం సందర్భంగా అంబాజీపేట, ఇసుకపూడి జెడ్పీ హైస్కూళ్లలో వైజ్ఞానిక ప్రదర్శలను శనివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఆన్‌లైన్ క్విజ్, రంగోలి పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజోలు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇస్రో శాస్త్రవేత్త గారపాటి సూర్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రామన్ ఎఫెక్ట్ ద్వారా అనేక రాకెట్ ప్రయోగాలు విజయవంతమయ్యాయని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు, వైస్ ప్రిన్సిపాల్ టీవీఎస్ పద్మనాభం, డాక్టర్ చంద్రబోస్, డాక్టర్ సాగర్, పీఆర్వో నల్లి రాజు, డాక్టర్ చిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో ర్యాంకులు వస్తాయని ప్రముఖ విద్యావేత్త, కోనసీమ సైన్సు పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వర శర్మ అన్నారు. శుక్రవారం లక్కవరం సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటు చేసిన కోనసీమ సైన్సు పరిషత్ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. త్వరలో పబ్లిక్ పరీక్షలు రాయబోతున్న పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి చక్కని ప్రేరణోపన్యాసాలు చేశారు. సభకు అధ్యక్షతన వహించిన శిశుమందిర్ సంచాలిత సమితి కార్యదర్శి మంగెన వెంకట నరసింహారావు మాట్లాడుతూ, ప్రశ్నలకు కేటాయించిన మార్కులను బట్టి జవాబులు పరిమితంగా రాయాలని, లేకపోతే సమయం వృథా అవుతుందన్నారు. శిశుమందిర్ బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


కొత్తపేటలో సైన్స్ ప్రాజెక్టులు తిలకిస్తున్న డీఎస్పీ మురళీమోహన్

మామిడికుదురు: సైన్స్ డే పురస్కరించుకుని మొగలికుదురు స్కూల్ విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ ఆవిష్కరణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. శాస్త్రవేత్తల చిత్రాలను సేకరించి వాటికి తమ సృజనాత్మకతను జోడించి వాటిని ప్రదర్శించారు. సైన్స్ చేసే అద్భుతాల నమూనాలను తమ ప్రతిభ ద్వారా ప్రదర్శించారు. సైన్స్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు, ఆఫ్తాల్మిక్ టెక్నీషియన్లు ఉచిత వైద్య సేవలందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుశీల లివింగ్‌స్టన్, ఏజీఎం పార్థసారథి, ఆర్ఐ రాజ్‌కుమార్, కో–ఆర్డినేటర్ శ్రీకాంత్, డీన్ రమేష్, ఏఓ బాలకృష్ణ, శ్రీనివాస్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచీ శాస్త్ర, సాంకేతికతను అవగాహన చేసుకోవడం ద్వారా ఆ దిశగా పయనించాలని స్థానిక డీఎస్పీ సుంకర మురళీమోహన్ బాలలకు సూచించారు. సీవీ రామన్ 'రామన్ ఎఫెక్ట్' ను కనుగొన్న సందర్భాన్ని పురస్కరించుకుని జరుపుకొంటున్న సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం స్థానికంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక కాంతిభారతిలో బాలలు తయారుచేసిన సుమారు 250 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను డీఎస్పీ ప్రారంభించారు. ఆయా ప్రాజెక్టులను సందర్శించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ అధ్యాపకుల ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం ఎన్ సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం సైన్స్ డే ఘనంగా జరిగింది. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, ఎనర్జీ పొదుపు, దోమల నిర్మూలన, ప్లాస్టిక్ వ్యర్థాల నిషేధం, వ్యవసాయ పద్ధతులు, మోడల్ సిటీ, స్వచ్ఛ భారత్ తదితర అంశాలను సోదాహరణంగా తెలియజేసే విధంగా పలు పాఠశాలల విద్యార్థులు చేపట్టిన సైన్స్ ప్రదర్శన స్థానికులను విశేషంగా ఆకట్టుకుంది. సైన్స్ ప్రదర్శనలో అద్భుత ప్రదర్శన చేసిన విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

అయినవిల్లి: మండలంలోని చింతనలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా గురువారం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనలు అకట్టుకున్నాయి. హెచ్‌ఎం పారుపూడి పల్లయ్యశర్మ ఆధ్వర్యంలో ఎస్ఎంసీ చైర్మన్ విళ్ళ వీరబాబు అధ్యక్షతన జరగ్గా ముఖ్యఅతిథులుగా సర్పంచ్ చింతలపూడి వెంకటరత్నం, ఎంఈఓ పి.శ్రీనివాస్ హాజరయ్యారు. ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ సైన్స్ ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను అలవరుస్తాయన్నారు. తొలుత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో మొత్తం 56 మంది విద్యార్థులు 28 బృందాలుగా ఏర్పడి ప్రాజెక్టులు ప్రదర్శించారు. విజేతలకు ఎంఈఓ శ్రీనివాస్, స్కూల్ కమిటీ చైర్మన్ వీరబాబు, సర్పంచ్ వెంకటరత్నంలు చేతుల మీదుగా బహుమతులు, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో విలస హెచ్‌ఎం పీవీవీ రవిప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయి


వెంకటేశ్వరి దంపతులను సన్మానిస్తున్న ఆర్డీఓ శ్రీకర్

అంబాజీపేట: విధి నిర్వహణలో భాగంగా ప్రజలకు సేవలందించే వారే వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. అంబాజీపేటలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జవ్వాది వెంకటేశ్వరి ఉద్యోగ విరమణ సన్మాన సభను స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ఉప్పలగుప్తం ఇన్‌చార్జి తహసీల్దార్ ఎస్.దివాకర్ అధ్యక్షతన శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ప్రజా సేవ చేస్తూ తహసీల్దార్ వెంకటేశ్వరి ఉద్యోగానికే వన్నె తెచ్చారన్నారు. అంకిత భావంతో మెరుగైన సేవలు అందించిన వారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటాదన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరి దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, స్థానిక నాయకుల పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం

సఖినేటిపల్లి: విద్యతో పాటు క్రీడలకు విద్యార్థులు ప్రాధాన్యమివ్వాలని మోరికి చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ జాన వీరభద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వార్షిక స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. తొలుత జాతీయ జెండాను డాక్టర్ ప్రసాద్ ఎగురవేసి, అనంతరం కబడ్డీ, వాలీబాల్, కోకో కోర్టులను ప్రారంభించారు. అంతకు ముందు బాలికలు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీధర్ కృష్ణ అధ్యక్షతన జరిగిన క్రీడల ప్రారంభోత్సవ సమావేశంలో డాక్టర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే చదువుతో పాటు ఆటలు కూడా చాలా అవసరం అని అన్నారు. పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గుబ్బల శ్రీలక్ష్మి, వైస్ చైర్మన్ చింతా శంకర్రావు, రిటైర్డ్ ఎంఈవో గోపాలకృష్ణ, పీఈటీలు కట్టా కృష్ణప్రసాద్, దివ్య లక్ష్మి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం


బాలుడి తాతకు సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ ఒంటిపై వేడి నీళ్ళు పడి ఒళ్లు కాలిపోయిన బాలుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.75,119 ఆర్థిక సాయాన్ని అందజేశారు. రావులపాలెం గ్రామానికి చెందిన మల్లిరెడ్డి సత్య కార్తికేయ (19) నెలలు రెండు రోజులు క్రితం ఇంటి దగ్గర వేడి నీళ్ల మీద పడడంతో ఒళ్లంతా తీవ్రంగా కాలిపోయింది. రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స జరుగుతుంది. వైద్యానికి రూ.3 లక్షల వరకూ ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. బాలుడి తండ్రికి అంత ఆర్థికస్తోమత లేకపోడవంతో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో సంస్థ సభ్యులు చేతుల మీదుగా బాలుడి తాత సూరంపూడి సతీష్‌కి వైద్యం నిమిత్తం రూ.75,119 చెక్కును సాయంగా అందజేశారు.

సూపర్ సిక్స్ పథకాలకు అరకొర నిధులు

మాజీ మంత్రి సూర్యారావు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సూర్యారావు

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెల గారడీ తప్ప సూపర్‌సిక్స్ పథకాలకు అరకొర నిధులు కేటాయించారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు ఆందోళన వ్యక్తం చేశారు. మామిడికుదురులో పార్టీ సీనియర్ నేత కటకంశెట్టి ఆదిత్య స్వగృహం వద్ద శుక్రవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి మండల శాఖ అధ్యక్షులు బొలిశెట్టి భగవాన్ అధ్యక్షత వహించారు. సూపర్‌సిక్స్‌లో కొన్నింటికి అరకొర నిధులు కేటాయించి కొన్నింటి ప్రస్తావన లేకుండా బడ్జెట్ ప్రవేశపెట్టారని దుయ్యబట్టారు. కేవలం వైఎస్సార్ సీపీ నేతలపై తప్పుడు కేసులు పెట్టి వారిని వేధించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కూటమి నేతలు గతంలో చేసిన దుర్మార్గమైన వ్యాఖ్యలు ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదా అని గొల్లపల్లి ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీలో నూతనంగా పదవులు పొందిన వారు పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలని సూర్యారావు హితబోధ చేశారు. సమావేశంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, పార్టీ నేతలు భూపతిరాజు సత్తిబాబురాజు, కట్టా శ్రీను, కుసుమ చంద్రశేఖర్, పాటి శివకుమార్, కంచర్ల శేఖర్, గుర్రం జాషువా, గుబ్బల మనోహర్, కూనపరెడ్డి రాంబాబు, ఉచ్చుల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెముడులంకలో డివైడర్ ఏర్పాటు చేయండి


డివైడర్ ఏర్పాటు కోరుతూ హైవే పీడీ సురేంద్రనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ తమ్మన శ్రీనివాసు

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని చెముడులంకలో గ్రామస్తుల సౌకర్యార్థం డివైడర్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ తమ్మన శ్రీనివాసు కోరారు. ఈమేరకు గ్రామస్తులతో కలసి శుక్రవారం ఆయన రాజమహేంద్రవరంలోని హైవే ప్రాజెక్టు డైరెక్టర్ సురేంద్రనాథ్‌కు కలసి వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగువానిలంక, చెముడులంక గ్రామ ప్రజలు రోడ్డు దాటాలంటే సుమారు కిలోమీటరు మేర తిరిగి రావాల్సి ఉండటంతో స్థానికులు అష్టకష్టాలు పడాల్సి వస్తుందని ఆవేదన చెందారు. డివైడర్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అలాగే చెముడులంక, మడికి, చొప్పెల్ల గ్రామస్తులకు సుమారు మూడు వేల ఎకరాల వరకూ రహదారికి అవల ఉన్న బడుగువానిలంకలో లంక భూములు సాగు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఇకనైనా హైవే అధికారులు సత్వరమే స్పందించి గతంలో ఉన్న డివైడర్‌ను పునరుద్ధరించాలని సర్పంచ్ తమ్మన విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపై స్పందిస్తూ డివైడర్ ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలా కృషి చేస్తామని హైవే పీడీ సురేంద్రనాథ్ హామీ ఇచ్చారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు

ఆలమూరు: స్థానిక సామాజిక ప్రభుత్వ ఆస్పత్రి (సీహెచ్‌సీ)లో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న నలుగురు చిరుద్యోగులను తొలగించారు. దశాబ్దకాలంగా పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న చంద్రమళ్ల లక్ష్మమ్మ, గంధం రాజేష్‌తో పాటు సెక్యూరిటీ విభాగంలో పనిచేస్తున్న గంధం కామేశ్వరి, ఎన్.మురళిని సూపరిండెంటెండ్ పి.గోపిరామ్ ఏకపక్షంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. తొలగించిన వారి స్థానంలో వెంటనే టీడీపీ సానుభూతి పరులతో భర్తీ చేశారు. విధుల నుంచి తొలగింపుతో జీవనోపాధి కోల్పోయినట్లు ఆ నాలుగు కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాలను పునరుద్ధరించకుంటే ఆత్మహత్యలే శరణ్యమని బాధిత కుటుంబసభ్యులు వాపోతున్నారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగానే ఈచిరుద్యోగులను తొలగించారనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీనిపై సూపరిండెంటెండ్ గోపీరామ్‌ను వివరణ కోరగా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ (హెచ్‌డీసీ) ఆదేశాల మేరకే ఉద్యోగులను తొలగించామన్నారు.

ఇంటర్ పరీక్షకు రెండు కేంద్రాల ఏర్పాటు

మామిడికుదురు: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు మామిడికుదురులో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు జెడ్పీహెచ్ స్కూల్‌లో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాల్లో 12 కళాశాలలకు చెందిన 870 మంది ఇంటర్ విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో 449 మంది మొదటి సంవత్సరం, 421 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉన్నారు. పరీక్షల నిర్వహణకు ఎస్.కాంతరాజు, బి.రఘురామ్‌ను చీఫ్ సూపరింటెండెంట్‌గా నియమించారు. ఎస్.నరిసేరావు, పి.కుమారరాజు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లుగా వ్యవహరించనున్నారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 23 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జూనియర్ కళాశాలలో మార్చి 18వ తేదీ వరకు, జెడ్పీహెచ్ స్కూల్లో మార్చి 15వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి.

నెలాఖరుకు నూరు శాతం పన్నులు వసూలు చేయాలి


తొత్తరమూడిలో రికార్డులు పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరా

అయినవిల్లి: పంచాయతీల్లో మార్చి 30 తేదీ కల్లా వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని ఈఓపీఆర్డీ వాణిశ్రీబెహరా పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని తొత్తరమూడి పంచాయతీ కార్యాలయంలో ఆమె పంచాయతీ పన్నుల వసూళ్ల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ఎస్.మూలపాలెం 100 శాతం, నేదునూరు 70 శాతం, తొత్తరమూడి 60 శాతం పన్నులు వసూలైనట్లు తెలిపారు. మిగిలిన పంచాయతీల్లో 50 శాతం నుంచి 60 శాతం పన్నులు వసూళ్లు చేసినట్లు తెలిపారు. మిగిలినది మార్చి 30వ తేదీకల్లా వసూళ్లు చేయాలని ఆమె పంచాయతీ కార్యదర్శులకు అదేశించారు.

దొంగల్ని పట్టించిన సీసీ కెమెరాలు

- మెడికల్ షాపులో నగదు చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్
- మొత్తం మూడు కేసుల్లో సొత్తు రికవరీ

పి.గన్నవరం: బైక్‌పై వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు పి.గన్నవరంలోని సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులకు చిక్కారు. వీరిలో ఒక బాలుడు ఉన్నాడు. వీరిద్దరు పి.గన్నవరంలోని గణేష్ మెడికల్ షాపుతో పాటు కోనసీమలో మరో రెండు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. వారి నుంచి చోరీ సొత్తును పోలీసులు రికవరీ చేశారు. ఫిబ్రవరి 23వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో బైక్‌పై ఇద్దరు వ్యక్తులు స్థానిక గణేష్ మెడికల్ షాపునకు వచ్చారు. ఒక వ్యక్తి బైక్‌పై ఉండగా, మరో వ్యక్తి షాపు యజమానిని ఓఆర్ఎస్ ప్యాకెట్లు కావాలని అడిగాడు. షాపు యజమాని ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసి ఇస్తున్న సమయంలో క్యాష్ కౌంటర్ వద్ద నగదు బ్యాగ్‌ను తీసుకుని బైక్‌పై పరారీ అయ్యారు. దీంతో షాపు యజమాని తోలేటి రాంబాబు ఫిర్యాదుతో ఎస్సై బి.శివకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక సెంటర్‌లోని సీసీ కెమెరాల ఆధారంగా బైక్ నంబర్‌ను పోలీసులు గుర్తించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాలతో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో సీఐ ఆర్.భీమారావు పర్యవేక్షణలో ఎస్సై బి.శివకృష్ణ, క్రైమ్ పార్టీ పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం ఉదయం 5 గంటల సమయంలో సీఐకి వచ్చిన సమాచారంతో స్థానిక పాత అక్విడెక్టు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక ఎస్సై, క్రైమ్ పార్టీ పోలీసులు అదుపులోకి తీసుకుని బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. బైక్ నంబర్ ఆధారంగా మెడికల్ షాపులో దొంగతనానికి పాల్పడింది.. వీరిద్దరేనని నిర్ధారించారు. ప్రస్తుతం సామర్లకోటలో ఉంటున్న కాకినాడ జగన్నాథపురానికి చెందిన యువకుడు యండమూరి అభిషేక్ కుమార్‌తో పాటు, మరో బాలుడిని ఈ కేసులో నిందితులుగా గుర్తించారు. మెడికల్ షాపులో చోరీ చేసిన రూ.95 వేలను రికవరీ చేశారు. అలాగే వీరిద్దరూ కలసి గత ఏడాది నవంబర్‌లో తాటిపాకలో చోరీ చేసిన మూడు బంగారు ఉంగరాలను, అమలాపురంలో చోరీ చేసిన రూ.6 వేలను రికవరీ చేసినట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు. ఎస్పీ కృష్ణారావు ఆదేశాలతో పి.గన్నవరంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో ఇటీవల కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ కెమెరాల ఫుటేజీ ద్వారా ఈ కేసును ఛేదించినట్టు ఎస్సై తెలిపారు. కేసును దర్యాప్తు చేసిన సీఐ భీమరాజు, ఎస్సై శివకృష్ణలను ఎస్పీతో పాటు, ఏఎస్పీ ప్రసాద్ అభినందించారు. నేరస్తులను గుర్తించడంతో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని, ఈ కారణంగా షాపుల వద్ద, ఇళ్ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని సహకరించాలని ఎస్పీ కృష్ణారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.